క్లుప్తంగా

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్



మతిస్థిమితం లేని వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

గోపాలపట్నం: మతిస్థిమితం లేని వ్యక్తి లక్ష్మీనగర్ శివాలయం వద్ద హల్‌చల్ చేశాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ శివాలయం వద్ద మతిస్థిమితం లేని వ్యక్తి గురువారం రాత్రి ఇళ్లలోకి చొరబడి సామగ్రిని చిందరవందర చేశాడు. అక్కడ దొరికిన ఇనుపరాడ్డుతో గుమిగూడిన వారిపై దాడికి పాల్పడి, అందరినీ భయభ్రాంతులకు గురిచేశాడు. స్థానికులు సాహసించి ఆ వ్యక్తిని పట్టుకున్నారు. 112కి ఫోన్ చేయడంతో గోపాలపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ వ్యక్తి నుంచి సమాచారం తెలుసుకునేందుకు యత్నించారు. బీహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కంటిపై గాయం కావడంతో రక్షక్ వాహనంపై చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే, ఇంతకు ముందు కూడా ఎక్కడో ఇలాగే గొడవ చేశాడని చెబుతున్నారు. పోలీసులు ఆ వ్యక్తిని తీసుకువెళ్లడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



ఏపీఈపీడీసీఎల్ ఏఈని సత్కరిస్తున్న సాయి మందిరం నిర్వాహకులు

మల్కాపురం : జీవీఎంసీ 60వ వార్డులోని గుల్లలపాలెం, మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద గల సద్గురు షిర్డిసాయిబాబా ఆలయంలో గురువారం సాయిబాబాకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ పూజా కార్యక్రమానికి శ్రీహరిపురం సబ్‌స్టేషన్ ఏఈ పావని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె సాయినాథునికి విభూది, పంచామృతాలతో అభిషేకం చేసి, అనంతరం హారతి పూజలలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం జరిగిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో కూడా ఆమె పాల్గొని, పలువురు భక్తులకు అన్న ప్రసాదాలను వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు, కోశాధికారి విజయ్‌కుమార్, ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌ల శుభ్రత



బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌ను యంత్రంతో శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఏయూక్యాంపస్: సాగర తీరంలో మురికిపట్టిన ఫుట్‌పాత్‌లను యంత్రంతో శుభ్రం చేస్తున్నారు. ఇసుక, మట్టి వంటివి సైతం తొలగిస్తున్నారు. బీచ్ రోడ్డులోని ఫుట్‌పాత్‌లపై దుకాణాలు, చిరువ్యాపారులు విక్రయాలు చేయడం వల్ల తినుబండారాలు అక్కడ చేరిపోతున్నాయి. మట్టి, ఇసుక వంటివి సైతం ఫుట్‌పాత్‌లపై పేరుకుపోతున్నాయి. దీంతో ఫుట్‌పాత్‌లు అధ్వానంగా తయారయ్యాయి. జీవీఎంసీ రహదారులను శుభ్రం చేసే యంత్రాలతో బీచ్ రోడ్డులో గురువారం ఫుట్‌పాత్‌లను శుభ్రం చేసే పనులు ప్రారంభించారు.

వివాహిత అదృశ్యం



సుజాత (ఫైల్)

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నీలాపువీధికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు న్యూపోర్టు పోలీసులు తెలిపారు. పెదగంట్యాడ మండలం, పెదగంట్యాడ గ్రామం, నీలాపువీధిలో దాతుల విజయ్ తన భార్య సుజాతతో కలిసి నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. విజయ్ గాజువాకలోని ఓ మెకానిక్ షెడ్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల మే 25న భర్తతో గొడవపడిన సుజాత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఆమె తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భర్త విజయ్, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో విజయ్ న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సంక్షోభంలో సినిమా హాళ్లు

థియేటర్లకు ఆదరణకు కరవు



గోపాలపట్నంలో మూసివేసిన మౌర్య థియేటర్



గోపాలపట్నంలో పాక్షికంగా ప్రదర్శనలు వేస్తున్న సుకన్య, సౌజన్య సినిమాహాళ్లు



మూతబడిన శంకరా సినిమాహాలు

- కష్టంగా మారుతున్న నిర్వహణ
- సినిమా హాళ్లపై ఓటీటీ ప్రభావం
- జనం ఉంటేనే సినిమా ప్రదర్శన



ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన హోమ్ థియేటర్

గోపాలపట్నం : ఒకప్పుడు పట్టణాల్లో, పల్లెల్లో సినిమా హాళ్ల సందడికి చిరునామా. సినిమా రిలీజ్ రోజున అభిమానుల కోలాహలం, టికెట్ల కోసం క్యూలు, విజిల్స్, కేకలతో నిండిన థియేటర్లు.. ఇదంతా ఒక గొప్ప అనుభూతి. వీటిపై ఆధారపడి ఎందరో జీవనం సాగించేవారు. కానీ ఇప్పుడు, ఆ వెండితెర వెలుగులు మసకబారుతున్నాయి. సినిమా హాళ్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

జనం లేకపోతే షో రద్దు

గోపాలపట్నం పరిసరాల్లో ఆరు సినిమా హాళ్లు ఉండేవంటే, ఆ ప్రాంతంలో సినిమాల పట్ల ప్రజలకు ఎంత ఆసక్తి ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఒక థియేటర్ మూతపడింది. మరో మూడు థియేటర్లు మంచి సినిమాలు వస్తే తప్ప తెరవని పరిస్థితి. కలెక్షన్లు సరిగా లేకపోతే ఆ రోజు సినిమా రద్దయ్యే దుస్థితి నగరాల్లోనూ నెలకొంది. గతంలో ఈ పరిస్థితి కేవలం పల్లెల్లోని టూరింగ్ టాకీసులకే పరిమితం అయ్యేది. 'సినిమా హాళ్లకు వచ్చి చూసే సంస్కృతి తగ్గిపోయింది' అని సినిమా హాల్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు వంద రోజులు ఆడిన సినిమాలు, ఇప్పుడు వారానికే పరిమితం అవుతున్నాయని సినీ ప్రేమికులు వాపోతున్నారు.

నిర్వహణ భారంగా మారుతోంది

సినిమా హాళ్ల నిర్వహణ ఒక పెద్ద సవాల్‌గా మారింది. సినిమా వేసినా, వేయకపోయినా నెలకు రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఇందులో విద్యుత్ బిల్లే నెలకు రూ.55 వేలు కావడం ఆందోళన కలిగించే విషయం. సినిమా ఆడితే ఈ ఖర్చులు మరింత పెరుగుతాయి. పంపిణీదారులు అమలు చేస్తున్న 'రెంటల్ విధానం' వల్ల సినిమా హాల్ యజమానులు నష్టపోతున్నారని, 'శాతం విధానం' కొంతవరకు మేలు చేస్తుందని వారి అభిప్రాయపడుతున్నారు.

ఓటీటీల ప్రభావం: ఇంటికే పరిమితమైన వినోదం

సినిమా హాళ్లకు అతిపెద్ద ముప్పు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు నుంచి వస్తోంది. సినిమాలు విడుదలైన రెండు, మూడు వారాల్లోనే ఓటీటీల్లోకి వచ్చేస్తుండటంతో ప్రజలు ఇంటికే పరిమితమవుతున్నారు. థియేటర్లకు వెళ్లడం అనేది ఒక వర్గం వారికి దాదాపు కనుమరుగైంది. దీనికి తోడు, ఆర్థిక స్థోమత ఉన్నవారు తమ ఇళ్లలోనే హోమ్ థియేటర్లు నిర్మించుకుంటున్నారు. ఎనిమిది మంది కూర్చునే చిన్న హోమ్ థియేటర్ నిర్మించడానికి సుమారు రూ.8 లక్షలు ఖర్చవుతుందని చెబుతున్నారు. ఇందులో చిన్న తెర, ప్రొజెక్టర్, సౌండ్ సిస్టమ్, సోఫాలు వంటి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుని, నచ్చిన సమయంలో, నచ్చిన సినిమాను సౌకర్యవంతంగా చూస్తున్నారు. ఇది సినిమా హాళ్ల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

సినిమా హాళ్లు కల్యాణ మండపాలు కానున్నాయా?

సినిమా హాళ్లు భవిష్యత్తులో కల్యాణ మండపాలుగా రూపాంతరం చెందుతాయా అనే అనుమానాలు బలపడుతున్నాయి. గోపాలపట్నం పరిధిలో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరుగుతుండటంతో, కొన్ని సినిమా హాళ్లు ఈ దిశగా అడుగులు వేయవచ్చని ప్రచారం జరుగుతోంది. చాలా సినిమా హాళ్లకు విశాలమైన పార్కింగ్ సదుపాయం ఉండటం ఈ పరివర్తనకు అనుకూలంగా ఉంది. కొందరు యజమానులు ఈ ప్రయత్నాల్లో ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

కాకానినగర్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

విశాఖ విద్య: రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని కాకాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్ రావు పిలుపునిచ్చారు. కేజీహెచ్‌లో వార్డు బాయ్‌గా విధులు నిర్వహిస్తున్న సాకేతపురానికి చెందిన యువకుడు యండపల్లి దేవుడు నాయుడు ఆధ్వర్యంలో, కేజీహెచ్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత సహకారంతో గురువారం కాకానినగర్‌లో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంత యువకులు పెద్ద సంఖ్యలో హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరంలో సుమారు 20 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకుడు యండపల్లి దేవుడు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. కేజీహెచ్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, స్థానికులు కామాకుల చంద్రరావు, ఎస్. శివ, రాము, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి.. ఐదుగురు అరెస్టు

మల్కాపురం : పేకాట శిబిరంపై దాడి చేసి, ఐదుగుర్ని మల్కాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి..మల్కాపురం, ప్రకాష్‌నగర్‌లోని ఒక ఇంట్లో ఐదుగురు వ్యక్తులు గురువారం మధ్యాహ్నం పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ఇంటి వద్దకు చేరుకొని, పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2,740 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

కూటమి వైఫల్యాలను ఎండగడదాం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్

- సూపర్ సిక్స్ మోసాలను ప్రజలకు వివరిద్దాం
- 4న జరిగే నిరసనకు పార్టీ శ్రేణులు తరలిరావాలి
- వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్

గోపాలపట్నం: టీడీపీ అధినేత చంద్రబాబుది 'ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికల అనంతరం మరో మాట' అని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన చంద్రబాబు తీరును నిరసిస్తూ, వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జూన్ 4వ తేదీన జరగనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థల ప్రతినిధులతో మళ్ల విజయప్రసాద్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాల పేరిట చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. తీరా గెలిచిన తర్వాత వాటిని అమలు చేయడంలో పొంతన లేని మాటలు మాట్లాడుతున్నారని వివరించారు. 'వీరికి ప్రజలకు మేలు చేసే పని కాకుండా కీడు చేసే పనులపైనే అధిక ప్రాధాన్యత ఇస్తారు' అని మళ్ల విజయప్రసాద్ విమర్శించారు. ఉచిత గ్యాస్ కొంతమందికేనని, ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదని, తల్లికి వందనం మాట మరిచారని – ఇలా వారివి అన్నీ మోసపూరిత మాటలేనని ఆయన దుయ్యబట్టారు. చంద్రబాబు నైజంపై ప్రజలలోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జూన్ 4వ తేదీన పెద్ద ఎత్తున జరగనున్న నిరసన కార్యక్రమాలకు తమ తమ వార్డుల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు పి.వి. సురేష్, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు గల్లా శ్రీను, పిల్లా కన్నబాబు, జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ, పలు వార్డుల అధ్యక్షులు ఆడారి శ్రీనివాస్‌రావు, పిన్నింటి అప్పలరాజు, రేవళ్ల సత్యనారాయణ, జీవీఎస్ఎన్ రాజు (కేబుల్ వాసు), ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అనీల్‌కుమార్, ఎస్సీ సెల్ ప్రతినిధి పూండి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధ డ్రైవ్ .. సిఫార్సులతో తుస్



గోపాలపట్నంలో తనిఖీలు చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది



గోపాలపట్నం బంక్ వద్ద నిషేధిత ప్లాస్టిక్ సంచిలో మామిడిపండ్లు తీసుకువెళుతున్న మహిళ

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులో ప్లాస్టిక్ నిషేధంపై గురువారం ఓ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. జోన్ 8 పరిధిలోని అన్ని వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది కలిసి పది బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో తనిఖీలు చేశారు. ప్రతి దుకాణానికి వెళ్లి నిషేధిత ప్లాస్టిక్ సంచులు వాడుతున్నారా లేదా అని పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి సంచులను స్వాధీనం చేసుకొని, జరిమానాలు విధించారు. ఈ తనిఖీలు 92వ వార్డులోని అన్ని ప్రాంతాల్లో జరిగాయి.

భారీగా ప్లాస్టిక్ సంచులు స్వాధీనం, జరిమానాలు

తనిఖీల్లో భాగంగా పలు దుకాణాల్లో భారీగా ప్లాస్టిక్ సంచులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వార్డులోనే 90 కిలోల నిషేధిత ప్లాస్టిక్ సంచులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత సంచులను వాడుతున్న వారిపై రూ. 15,300 జరిమానాలు విధించినట్లు 92వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు.

'సిఫార్సుల'తో లక్ష్యానికి తూట్లు?

ఈ తనిఖీల్లో అధికారులు సిఫార్సులకు తలొగ్గక తప్పలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక దుకాణం వద్ద భారీగా ప్లాస్టిక్ సంచులు దొరికినా, 'సిఫార్సులు' రాగానే వాటిలో అతి తక్కువ మొత్తంలోనే స్వాధీనం చేసుకున్నారని బహిరంగంగా చెప్పుకుంటున్నారు. స్థానిక వర్తక సంఘం సభ్యుల నుంచి ఫోన్లు రాగానే, సుమారు 50 కిలోల సంచుల్లో 20 కిలోలు మాత్రమే తీసుకుని, మిగిలినవి వారికే తిరిగి ఇచ్చేశారని తెలుస్తోంది. ఉన్నతాధికారులే ఇలా చేస్తే, తనిఖీలు చేసేవారు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఈ విషయం తెలిసిన వారు చర్చించుకుంటున్నారు. ఇది ప్రత్యేక డ్రైవ్ లక్ష్యాన్ని తూట్లు పొడవడమే అవుతుందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల ముందే...

తనిఖీలు ముగించుకుని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు తిరుగు ప్రయాణమవుతున్న సమయంలో ఒక మహిళ నిషేధిత ప్లాస్టిక్ సంచిలో మామిడి పండ్లను తీసుకెళ్తుండటం కనిపించింది. దీనిని చూసిన వారు నిషేధం ఎక్కడ? తనిఖీలు ఏమయ్యాయి? అని ప్రశ్నిస్తున్నారు. ఇది తనిఖీలు నిర్వహించిన వారికే 'వెటకరిస్తున్నట్లు'గా ఉందని పలువురు సెటైర్లు వేస్తున్నారు. అధికారుల అలసత్వం, సిఫార్సుల ప్రభావం కారణంగా ప్లాస్టిక్ నిషేధ డ్రైవ్‌లు పూర్తిస్థాయిలో విజయవంతం కావడం లేదని ఈ సంఘటన రుజువు చేస్తోంది.

కుటుంబ బంధాలను కాపాడుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, చిన్నారులు

మల్కాపురం: ప్రతి ఒక్కరూ కుటుంబ బంధాలను కాపాడుకోవాలని ప్రముఖ కార్మిక నాయకుడు, సామాజిక కార్యకర్త బి.సత్యానందం అన్నారు. తల్లిదండ్రులు, తోబుట్టువులు, అత్తమామల పట్ల బాధ్యతలను నెరవేర్చాలని సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతీయ సంస్కృతిలో కుటుంబమే బలమైన వ్యవస్థని, దాని మూలాలను నిలబెట్టాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందని అన్నారు. కుటుంబాలలో సంతోషం వెల్లివిరిస్తేనే దేశం సౌభాగ్యవంతంగా ఉంటుందన్నారు. కుటుంబ బంధాలను ప్రతిబింబించే కథలను తెలియజేశారు.

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎంకు ఘన సత్కారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ చీఫ్ జనరల్ మేనేజర్ జి.గాంధీకి స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం జరిగింది. ఈ నెలాఖరున ఆయన పదవీ విరమణ చేయనున్న సందర్భంగా గురువారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు గాంధీకి శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం గాంధీ తన వంతు సహకారం అందించారని కొనియాడారు.

కేఎంఆర్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఆర్ఐవో మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

విశాఖ విద్య: విద్యార్థులను మోసగించిన మధురవాడ కేఎంఆర్ జూనియర్ కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పిఠాపురం కాలనీలోని ఆర్ఐవో కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నితిన్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడాలని చూసిన కేఎంఆర్ జూనియర్ కళాశాల అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఫేక్ ఎంసెట్ హాల్‌టికెట్లు అందించిన కారణంగా ఐదుగురు పరీక్ష రాయలేకపోయారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆర్ఐవో మురళీధర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ప్రసాద్, స్టేట్స్ సోషల్ మీడియా కన్వీనర్ వివేక్, జోనల్ ఇన్‌చార్జి ధనుష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం సొంతం

- మానసిక ఒత్తిడి దూరం
- జోన్–5 జెడ్సీ రాము
- 60వ వార్డులో యోగా శిక్షణ




శిక్షణలో పాల్గొన్న ట్రైనర్లు

మల్కాపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జోన్-5 జెడ్సీ బి.రాము అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ జోన్-5 అధికారుల ఆదేశాల మేరకు 60వ వార్డు గుల్లలపాలెం వద్ద పలువురు స్థానికులకు, సచివాలయ సిబ్బందికి యోగాపై ఉచిత శిక్షణను గురువారం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎంతటి ఒత్తిడినైనా యోగాతో జయించవచ్చన్నారు. యోగా వలన మానసిక ఆనందం, ఆరోగ్యం, సొంతమవుతాయన్నారు. నిత్యం ప్రతి ఒక్కరూ యోగా సాధన చేస్తే వైద్యుని వద్దకు వెళ్లే పని ఉండదన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వి.సతీష్‌కుమార్ యాదవ్, రమేష్, డి.రవి, నవరత్నం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

యోగా ట్రైనర్లకు శిక్షణ

విశాఖ విద్య: యోగా ట్రైనర్స్‌కు ఎన్ఏడీలోని ఓ ప్రైవేటు స్కూల్ ప్రాంగణంలో గురువారం శిక్షణ ప్రారంభమైంది. 89,90,91,92 వార్డులకు చెందిన మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 21న నగరంలో జరిగే యోగా దినోత్సవం విజయవంతమయ్యేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ ట్రైనర్లు, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

పొగాకు అనర్థాలపై అవగాహన రేపు



వివిధ రకాల సిగరెట్ పరికరాలు

మద్దిలపాలెం: ఈ నెల 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పొగాకు తాగడం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు మాజీ బ్యాంక్ ఉద్యోగి జి.ఎస్.శివప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా తాను సేకరించిన సిగరెట్ తాగేవారు ఉపయోగించే పలు రకాల పరికరాలతో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 15వ వార్డు జేఆర్ నగర్‌లోని తన ఇంటి వద్ద 31వ తేదీ శనివారం ఈ పరికరాలతో యువకులకు అవగాహన కల్పిస్తానన్నారు. ఆర్థిక ఇబ్బందులు, పర్యావరణ కలుషితం, అనేక వ్యాధులకు, ఉత్పాదకత నష్టాలకు కారణమవుతున్న పొగాకును నిర్మూలించాలని శివప్రకాష్ పిలుపునిచ్చారు. పొగ తాగడం వల్ల క్యాన్సర్, గుండెపోటు, మెదడు పోటు వంటి ప్రమాదకర వ్యాధులు సంభవిస్తున్నాయని, దీనికి యువత దూరంగా ఉండాలని హితవు పలికారు.

సక్రమంగా పనిచేయకపోతే కఠిన చర్యలు



చినవాల్తేరు యూపీహెచ్‌సీలో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ఆరోగ్య కార్యక్రమాల ప్రణాళిక ప్రకారం పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం చినవాల్తేర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) సందర్శించారు. అక్కడ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఆరోగ్య కార్యక్రమాల గురించి వివరించారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో అన్ని ఆరోగ్య ఇండికేటర్లు తక్కువగా ఉండటంతో సిబ్బందికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు సాయంత్రం 4 గంటల వరకు క్షేత్ర సందర్శనలో ఉండి అభ ఐడీ నమోదు, ఎన్‌సీడీసీడీ సర్వే చేయాలన్నారు. జూన్ 15 లోపు శత శాతం సాధించాలన్నారు. ఆశ కార్యకర్తలు సక్రమంగా విధులు నిర్వర్తించనట్లయితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్యూటీ ఉండగా మధ్యాహ్నం 12.30 గంటలకే ఆశ కార్యకర్తలు కనిపించడం లేదన్నారు. వీరిచేత తక్షణమే డ్యూటీ చార్ట్ ప్రకారం పని చేయించుకోవాలని, ఈ బాధ్యతలను కేంద్రం వైద్యులు పర్యవేక్షించాలన్నారు. ఈ సందర్శనలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, డాక్టర్ బి.హారిక, ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ సెల్ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

సీతంపేట: హ్యూమన్ రైట్స్ సెల్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అక్కయ్యపాలెం జీవీఎంసీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఎం.ఎ న్.వి.విశ్వనాథం నియమితులయ్యారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు వి.రామకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.పి. శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.ఎం.నాయుడు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కె.రాజా చేతుల మీదుగా గురువారం ఆయన నియామక పత్రం అందుకున్నారు. విశాఖ జిల్లా అధ్యక్షుడిగా వి.చంద్రమౌళి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.ఎస్.ఎన్.రాజు, ఉపాధ్యక్షుడిగా ఎస్.దొరబాబు, మహిళా ఉపాధ్యక్షురాలిగా దీనాకుమారి, జాయింట్ సెక్రటరీలుగా కుప్పిలి గోవింద్ పట్నాయక్, ఎస్.కుష్వంత్, కోశాధికారిగా పి.సత్యనారాయణ రెడ్డి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం చేత జె.ఎం.నాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు.